


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 05-08-2026 సంపుటి : 08 సంచిక 52 పేజీలు : 8 వెల : రూ 3-00


## ప్రజల్లో సైలెంట్ రివల్యూషన్.. 2024లో ఊహించని విజయం: సీఎం చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 4: 2024లో ఎవరూ ఊహించని విజయం సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు(మంగళవారం) ఏపీ ఆర్థిక పరిస్థితిపై సీఎం శ్వేతపత్రం విడుదల చేశారు. 2024 నాటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులపై వాస్తవాలు విడుదల చేసిన సీఎం.. ఈ ప్రజెంటేషన్ బాధ్యత గల ప్రభుత్వం ఇచ్చే నివేదిక అని చెప్పుకొచ్చారు. సమర్థవంతంగా ప్రభుత్వాలు పనిచేసి.. గవర్నెన్స్ బాగుంటే ప్రజలపై ప్రభావం ఉంటుందన్నారు. 2024లో ఒక సైలెంట్ రివల్యూషన్ ప్రజల్లో వచ్చిందన్నారు. 1982, 1994, తాజాగా 2024లో ఇలాంటి ఫలితాలు చూశామన్నారు. 2024లో 94శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని... అది ఊహించని విప్లవమని తెలిపారు. రాష్ట్రవిభజన తరువాత ఏపీ వ్యవసాయాధారిత రాష్ట్రంగా అయిపోయిందని.. 58 శాతం ప్రజలకు 46 శాతం మాత్రమే వనరులు దక్కాయన్నారు. రెండు రాష్ట్రాలను ఉమ్మడిగా అభివృద్ధి చేశామని చెప్పారు.ఏపీలో విధ్వంసం జరిగిందని.. దీనివల్ల రాష్ట్ర ఆదాయం పడిపోయిందని సీఎం విమర్శించారు. ఎక్కడ చూసినా పాలన దెబ్బతిన్నదని... అధికారులలో కూడా నైతిక స్థైర్యం దెబ్బతిన్నట్లు తెలిపారు. ఓ వ్యక్తి డామేజ్ అయితే పర్వాలేదని.. బ్రాండ్ పోతే చాలా కష్టమన్నారు. ఆనాడు ఏపీ నుంచి పరిశ్రమలు వెళ్లిపోయాయన్నారు. ఎన్డీఏ వచ్చాక రివైవల్, రీబిల్డ్ స్టార్ట్ చేశామని తెలిపారు. బ్రాండ్ ఆంధ్రా రివైవ్ అయితే మిగిలినవి అన్ని ఆటోమెటిగ్‌గా రివైవ్ చేయగలమని వివరించారు. విభజన తరువాత 5 ఏళ్లలో 13.5 శాతం వృద్ధి సాధించినట్లు చెప్పుకొచ్చారు. ఇదే వృద్ధి కొనసాగి ఉండి ఉంటే ఏపీ పరిస్థితి మరోలా ఉండేదన్నారు. 2023-24లో ఏపీకి జీరో డెట్ సస్టైనబిలిటీ అని నీతి అయోగ్ చెప్పిందని.. దీనికి కారణం క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టకపోవడమే అని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను మార్టిగేజ్ చేశారని.. లిక్కర్ భవిష్యత్తు ఆదాయాన్ని తాకట్టు పెట్టారని మండిపడ్డారు. అప్పుల రేట్ ఆఫ్ ఇంట్రస్ట్ భారీగా పెంచేశారని... దీంతో అప్పుపుట్టకపోవడంతో కేంద్ర పథకాలను డైవర్ట్ చేశారని ఆరోపించారు. 86 కేంద్రప్రాయోజిత పథకాలను రివైవ్ చేశామన్నారు. స్థానిక సంస్థలకు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు వచ్చినా వాటిని మళ్లించారని.. వాటిని కూడా సరిచేసినట్లు సీఎం తెలిపారు. ఇప్పటివరకూ రూ. 1,49,401కోట్లు సంక్షేమంపై ఖర్చు చేశామన్నారు. మెగా డీఎస్సీ విషయంలో కోడిగుడ్లపై ఈకలు పీకుతున్నారంటూ మండిపడ్డారు. లిక్కర్ షాపులు, గనుల కేటాయింపుల్లో ప్రాధాన్యం కల్పించామన్నారు. మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## రాయలసీమ సాగునీటికి ప్రభుత్వ ప్రాధాన్యం--

### రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 4: రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు శాశ్వత నీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నంద్యాల స్టేట్ గెస్ట్



హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.గోరుకల్లు, అలగనూరు, శ్రీశైలం తదితర సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు, అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టామని, రాయలసీమకు కృష్ణా జలాలను సమర్థవంతంగా అందించేందుకు అవుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, హంద్రీ-నీవా, గండికోట, ఎస్ఆర్‌బీసీ వంటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత రెండేళ్లలో సాగునీటి రంగంపై రూ. 12,484 కోట్లు ఖర్చు చేయగా, 2026?27 బడ్జెట్‌లో మరో రూ. 10,014 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో రూ. 35,313 కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.రాయలసీమలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, గోరుకల్లు వద్ద ఇండస్ట్రియల్ హబ్, జిల్లాలో డ్రోన్ హబ్‌తో పాటు కొలిమిగుండ్లలో రూ. 4,000 కోట్లతో అల్ట్రాటెక్ రెండో యూనిట్, రామ్‌కో విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా మాట్లాడుతూ, ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరికి బదులుగా మినుము, కంది, పెసర, జొన్న, కొర్రలు, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రతి రైతుతప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని కోరుతూ, జిల్లాలో తాగునీటి కొరత తలెత్తకుండా, రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు జీతాలెందుకు?: స్పీకర్ అయ్యన్నపాత్రుడు..

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని ఎమ్మెల్యేలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజల కోసం పోరాటం చేయాల్సిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం, నియోజకవర్గాల కోసం పని చేయకపోతే మీారెందుకంటూ ప్రశ్నల వర్షం గుప్పించారు. అసెంబ్లీకి రాకపోతే



జీతభత్యాలు ఎందుకు ఇవ్వాలని సూటిగా ప్రశ్నించారు.ఇదే విషయాన్ని స్పీకర్ల కాన్ఫరెన్స్‌లోనూ తీర్మానించినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. అసెంబ్లీకి రాని వారికి జీతభత్యాలు ఇవ్వకూడదంటే దానిపైనా చర్చ చేస్తున్నారని ఆగ్రహించారు. ఒకప్పుడు అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రసంగాలు చూసి.. మళ్లీ ఎప్పుడు సమావేశాలు నిర్వహిస్తారా? అని ఎదురు చూసేవాళ్లమని అన్నారు. నేడు అసెంబ్లీలో అలా మాట్లాడే వారు ఎవరైనా ఉన్నారా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సమావేశాల్లో బూతులు తిట్టుకోవడమే సరిపోతుందని వ్యాఖ్యానించారు. నేటి రాజకీయాల్లో పూర్తిగా విలువలు పోయాయని స్పీకర్ అన్నారు.మరోవైపు, తెలుగు భాషను ప్రోత్సహించడంపైనా అయ్యన్నపాత్రుడు స్పందించారు. మన భాషను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని సూచించారు. తెలుగును శాసనసభలో ప్రోత్సహించడం కోసం సభాపతిగా తాను బాధ్యత తీసుకుంటానని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రతి ఎమ్మెల్యే తెలుగులో మాట్లాడితేనే మైక్ ఇస్తానని, లేదంటే మైక్ కట్ చేస్తానని తేల్చి చెప్పారు. మండలి వెంకట కృష్ణారావు, వెంకయ్య నాయుడు, ఎన్టీఆర్ వంటి వారిని నేటి తరం నేతలు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు.

## ప్రధాని మోదీతో నితీశ్ కుమార్ భేటీ..

### బాంకీపూర్ ఓటమిపై చర్చ..!



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో బిహార్ మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ ఎంపీ నితీశ్ కుమార్ భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లోని ప్రధాని కార్యాలయంలో ఇవాళ (మంగళవారం) మోదీ, నితీశ్ సమావేశమయ్యారు. బిహార్‌లోని బాంకీపూర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ ఓటమి పాలైన తర్వాత మోదీని జేడీయూ అధినేత నితీశ్ తొలిసారిగా కలిశారు. దీంతో వీరిద్దరి భేటీపై ఆసక్తి నెలకొంది.ఈ సమావేశంలో బాంకీపూర్ సీటు కోల్పోవడం, ఓటమికి గల కారణాలు, ఎన్డీయే తదుపరి కార్యాచరణ వంటి అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో నితీశ్‌తో పాటు జేడీయూ నాయకుడు, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాజ్యసభ ఎంపీ సంజయ్ కుమార్ ఝా పాల్గొన్నారు. మరోవైపు, వీరి భేటీకి సంబంధించిన సమాచారాన్ని ప్రధాన మంత్రి కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అయితే, ఈ సమావేశంలో ఏయే అంశాలపై చర్చించారనే విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.కాగా, బీజేపీ కంచుకోటగా ఉన్న బాంకీపూర్ అసెంబ్లీ స్థానాన్ని జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ కైవసం చేసుకున్నారు. నిన్న (సోమవారం) వెలువడిన ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాను ఆయన 19,324 ఓట్ల తేడాతో ఓడించారు. ప్రశాంత్ కిషోర్‌కు 64,151 ఓట్లు రాగా.. నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు వచ్చాయి. బాంకీపూర్ ఎమ్మెల్యేగా ఉన్న నితిన్ నబీన్.. రాజ్యసభకు ఎన్నిక, బీజేపీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ స్థానానికి ఆయన రాజీనామా చేశారు. దీంతో బాంకీపూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ప్రశాంత్ కిషోర్ విజయ బావుటా ఎగరవేశారు.

## లోక్‌సభలో కొనసాగిన విపక్షాల ఆందోళన..

### రెండు బిల్లులకు ఆమోదం

న్యూఢిల్లీ ,నీట్ పేపర్ లీకేజీ అంశం, రామాలయ విరాళాల చోరీ ఘటనలు లోక్‌సభను ఇవాళ కూడా స్తంభింపజేశాయి. సభ సజావుగా సాగనివ్వాలని స్పీకర్ ఓం బిర్లా విపక్ష సభ్యులను కోరగా.. వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. అయితే.. ఈ ఆందోళనల నడుమే కేంద్రం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. ట్యాక్సేషన్ ఇతర చట్టాల సవరణ బిల్లు, అప్రప్రియేషన్ బిల్లు-2026ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. దీంతో వెంటనే సభలో చర్చకు రాగా.. విపక్ష సభ్యులు ఇరు బిల్లులనూ వ్యతిరేకిస్తూ గందరగోళం సృష్టించారు. కానీ.. చివరకు మూజువాణి ఓటుతో రెండు బిల్లులూ ఆమోదం పొందాయి. ఆ తర్వాత సభను రేపటికి వాయిదా వేశారు స్పీకర్.




# సంపాదకీయం

బుధవారం 05-08-2026

## మారుతున్న రాజకీయాలు

ఒకప్పుడు రాజకీయాల్లో ప్రజల మనసు గెలవాలంటే పాదయాత్రే ప్రధాన ఆయుధంగా ఉండేది. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకోవడం ద్వారా నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకునేవారు. కానీ కాలం మారుతోంది? రాజకీయ కమ్యూనికేషన్ కూడా మారుతోంది. ఇప్పుడు జాబ్ మేళాలు, మెడికల్ క్యాంపులు, మహిళా సమావేశాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ కావడం వంటి కొత్త పద్ధతులు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. మరి నిజంగానే పాదయాత్రల యుగానికి ప్రత్యామ్నాయం వచ్చిందా?తెలుగు రాష్ట్రాల్లో గత రెండు దశాబ్దాలుగా పాదయాత్రలు రాజకీయ విజయానికి కీలక వ్యూహంగా నిలిచాయి. 2003లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి చేపట్టిన పాదయాత్ర, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన "వస్తున్నా మీ కోసం", వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన "ప్రజా సంకల్ప యాత్ర" వంటి కార్యక్రమాలు రాజకీయంగా పెద్ద మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి ఇవి సమర్థమైన వేదికలుగా మారాయి.అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియా విస్తరణతో నాయకుడు ఒక గ్రామంలో చేసిన కార్యక్రమం క్షణాల్లోనే లక్షల మందికి చేరుతోంది. దీంతో ప్రజలను కలవడానికి పాదయాత్ర ఒక్కటే మార్గం కాదనే భావన బలపడుతోంది. ఇక ప్రజల అంచనాల్లో కూడా మార్పు కనిపిస్తోంది. "ఎంత నడిచారు?" అనే ప్రశ్న కంటే "ఏం చేశారు?" అనే ప్రశ్నకు ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ముఖ్యంగా యువత ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై నాయకుల చర్యలను గమనిస్తోంది. అందుకే రాజకీయ నాయకులు కూడా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నిరంతర ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇటీవలి కాలంలో మెగా జాబ్ మేళాలు, ఉచిత వైద్య శిబిరాలు, మహిళా సంఘాలతో సమావేశాలు, రైతు అవగాహన సదస్సులు, స్కిల్ ట్రైనింగ్ క్యాంపులు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇవి ఏ ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కాకుండా వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అమలు చేస్తున్న కార్యక్రమాలుగా మారుతున్నాయి.అదే సమయంలో ప్రచార విధానంలో కూడా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు పోస్టర్లు, భారీ బహిరంగ సభలు ప్రధాన ప్రచార సాధనాలైతే, ఇప్పుడు రీల్స్, షార్ట్ వీడియోలు, లైవ్ స్ట్రీమింగ్, డిజిటల్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్థానిక స్థాయిలో చిన్న సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. అయితే రాజకీయ విజయాన్ని ఒక్క అంశంతోనే ముడిపెట్టలేమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పార్టీ బలం, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ఎన్నికల సమయంలో నెలకొనే రాజకీయ వాతావరణం వంటి అనేక అంశాలు కలిసి ఫలితాలను ప్రభావితం చేస్తాయి.భారతదేశంలో డిజిటల్, సోషల్ మీడియా విస్తరణ నేపథ్యంలో, ప్రజా చర్చ మరియు ప్రజాభిప్రాయ స్వయంప్రతిపత్తి సవాలుకు గురయ్యాయి. భారతదేశపు 2019 సార్వత్రిక ఎన్నికలు, నిజమైన డిజిటల్ వినియోగ సమాజంలో జరిగిన మొట్టమొదటి జాతీయ ఎన్నికలు. ఈ ఎన్నికలలో, ఓటర్లలో సుమారు సగం మందికి డిజిటల్ మార్గాలు అందుబాటులో ఉండగా, మరో మూడో వంతు మందికి సోషల్ మీడియా అందుబాటులో ఉంది. ప్రపంచ పోకడకు అనుగుణంగా, భారతీయ రాజకీయ నాయకులు తమ మద్దతుదారులతో నేరుగా మమేకమవ్వడానికి, రోజువారీ రాజకీయ సంభాషణల కోసం సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. జిటల్ వేదికలపై కార్యకలాపాలను, అలాగే అవి విస్తృత రాజకీయ సమీకరణ నుండి ఏ విధంగా విడదీయరానివిగా ఉన్నాయో విశ్లేషిస్తుంది.ఔజూలోని దక్షిణాసియా అధ్యయనాల సంస్థ మరియు కొన్రాడ్ అడెనార్ స్టిఫ్టుంగ్ నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో ఈ పత్రాల ముసాయిదా ప్రతులు సమర్పించబడ్డాయి."ప్రధాన మీడియా స్రవంతిని బీజేపీ తన నియంత్రణలోకి తీసుకుంది" అని కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం హెడ్ సుప్రియా శ్రీనేత్ అన్నారు.మా నిధులను స్తంభింపచేశారు. ప్రకటనలపై ఖర్చు పెట్టేందుకు మా దగ్గర డబ్బులు లేవు" అని ఆమె అన్నారు. ఎన్నికలకు ముందుగా ఆదాయపు పన్ను విభాగం తీసుకున్న చర్యల గురించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం రాజకీయ ప్రతీకారం తీర్చుకుంటోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే, దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయని, దీనిలో తమ పాత్రేమీలేదని ప్రభుత్వం అంటోంది."ఇలాంటి ఇబ్బందుల నడుమ ఓటర్లను చేరుకునేందుకు ఇన్‌ఫ్లూయెన్సర్లు వారధిలా పనిచేస్తున్నారు. మా పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసం ఉండేవారితోపాటు మా వర్క్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయాలనుకునేవారితో మేం కలిసి పనిచేస్తున్నాం'' అని ఆమె చెప్పారు.సోషల్ మీడియాను ప్రజాస్వామ్యీకరించడంలో ఇన్‌ఫ్లూయెన్సర్లు సాయం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మాజీ పొలిటికల్ అడ్వైజర్ అంకిత్ లాల్ అన్నారు.ద దేశ్‌భక్త్ యూట్యూబ్ చానెల్ నడిపే మాజీ జర్నలిస్టు ఆకాశ్ బెనర్జీ మాట్లాడుతూ ఇన్‌ఫ్లూయెన్సర్లు తమ హద్దులను చెరిపేసుకుంటూ ఒక్కో అడుగు ముందుకు వెళ్తున్నారని చెప్పారు.జర్మనీ నుంచి యూట్యూబ్ చానెల్ నడిపిస్తున్న ధ్రువ్ రాఠీ తాజాగా చేసిన 'ఈజ్ ఇండియా బికమింగ్ ఎ డిక్టేటర్‌షిప్?' వీడియోను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఆ వీడియోకు ఇప్పటివరకూ 24 మిలియన్ల వ్యూస్ వచ్చాయి.

## 'ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షోభంలోకి వ్యవసాయ రంగం'

అప్పులు చెల్లించమని రైతులపై బ్యాంకర్ల ఒత్తిడి

లో వోల్టేజితో కాలుతున్న మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు

పిఓఎల్ రద్దు చేయడం దురదృష్టకరం

తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

ముఖ్య నాయకులతో కలిసి ఆర్డీఓకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వినతి

కోదాడ, ఆగస్టు 04 : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని, ఎన్నికల్లో రైతులకు అండగా ఉంటామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతులను దగా చేస్తుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ముఖ్య నాయకులతో



కలిసి ఆర్డీఓ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట సాగు ప్రారంభ దశలో రైతులకు అవసరమైన క్రాప్ లోన్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. గతంలో ప్రతి ఏడాది రైతులు పంట రుణాలను సులభంగా రెన్యువల్ చేసుకునేవారని ప్రస్తుతం బ్యాంకులో పాత రుణ మొత్తం అసలు, వడ్డీతో సహా చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని రైతులను తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. బ్యాంకులపై ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడం వల్ల రైతులు మళ్లీ ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకోలేదని, లో వోల్టేజీతో మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, సకాలంలో నీరందకపోతే పంటలు ఎండిపోవడం ఖాయమని ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా ఎరువుల రవాణాకిచ్చే ప్రైవేట్ ఆన్ లారీ (ఎఫ్ ఓ ఎల్) రాయితీని ప్రభుత్వం రద్దు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ నిర్ణయంతో పీఏసీఎస్‌లు, డీలర్లు అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తుందని ఈ భారం రైతుల పైనే పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎరువుల కొరత ఏర్పడి బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సిరెడ్డి, ఎస్.కె నయీమ్, చీమ నరేష్, కె.బాబు, తుమ్మలపల్లి భాస్కర్, ఉపేందర్ గౌడ్, గొర్రె రాజేష్, చీమ శ్రీనివాస్, గట్ల కోటేశ్వరరావు, కరీముల్లా, బాబా, చలిగంటి వెంకట్, మండల పార్టీ బాధ్యులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## రాజీనామా చేస్తానంటే.. వెంటనే ఓకే చేస్తా.. అసంతృప్తులపై కర్ణాటక సీఎం వ్యాఖ్య

కర్ణాటక , ఇటీవల కర్ణాటక కేబినెట్ విస్తరణ నేపథ్యంలో మంత్రిగా అవకాశం దక్కని అనేక మంది ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంతో సీఎం డీకే శివకుమార్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అవకాశాలు వచ్చే



వరకూ సహనంతో ఉండాలని హితవు పలికారు. ఎవరైనా రాజీనామా చేస్తానంటే నిమిషాల్లో ఒకే చేస్తానని కూడా తేల్చి చెప్పారు. తాజా కేబినెట్ విస్తరణలో 20 మంది ఎమ్మెల్యేలకు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకు సీఎం డీకే తన కేబినెట్‌ను విస్తరించారు.కేబినెట్‌లో చోటు దక్కక అసంతృప్తితో ఉన్న వారిని ఉద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రిజైన్ చేస్తానన్న వారంతా రాజకీయాలు చేస్తున్నట్టే. రాజీనామా చేస్తాననే వారిని ఎవ్వరూ ఆపలేరు. కానీ వారికి ఒక పార్టీ కావాలి. పార్టీలో భవిష్యత్తు కావాలి. అలాంటివి ఇచ్చేది తమ పార్టీ ఒక్కటే. ధరమ్ సింగ్ సమయంలో నేను రాజీనామా చేసుండొచ్చు. ఆ తరువాత కూడా అలాంటి పరిస్థితులు వచ్చాయి. సిద్ధరామయ్య సమయంలో కూడా ఈ పరిస్థితి ఉంది. ఆ సమయాల్లో నేను ఓర్పుతో ఉండలేదా? వీరేంద్ర పాటిల్ హయాంలో బంగారప్పకు అవకాశం దక్కలేదు. ఖర్గే సాబ్‌కు అవకాశం రాలేదు. ఒకసమయంలో ధరమ్ సింగ్‌కు ఛాన్స్ రాలేదు. వారిలో కొందరు ఆ తరువాత సీఎంలు కాలేదా? ఇలాంటి సమయాల్లో ఓర్పుతో ఉండాలి. పార్టీ మనకు చాలా ముఖ్యం' అని అన్నారు. ఇక అసంతృప్తి ఎమ్మెల్యేలను బుజ్జగించే పనిని పార్టీ సీనియర్ లీడర్లకు సీఎం అప్పగించారు.

## ఎయిర్ ఇండియా విమానంలో తీవ్రమైన కుదుపులు.. 12 మందికి స్వల్ప గాయాలు


ఢిల్లీ, ఆగస్టు 4: ఫుకెట్ (థాయ్‌లాండ్) నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానంలో మంగళవారం అనుకోకుండా తీవ్ర కుదుపులు(టర్బులెన్స్) ఏర్పడ్డాయి. ఈ ఊహించని పరిణామంతో విమానంలో ప్రయాణిస్తున్న 12 మంది గాయపడగా, విమానం కూడా స్వల్పంగా దెబ్బతిన్నట్లు సమాచారం.ఇవాళ (ఆగస్టు 4) 134 మంది ప్రయాణికులతో ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎఐ379 ఎయిర్ ఇండియా విమానం గాల్లో ఉండగా ఒక్కసారిగా తీవ్రమైన కుదుపులకు గురైంది. దీనివల్ల క్షణాల వ్యవధిలోనే విమానం ఎత్తు (ఆల్టిట్యూడ్) ఒక్కసారిగా పడిపోయింది.విమానంలో ఉన్న ప్రయాణికుడు ఒకరు మాట్లాడుతూ... 'విమానం ఎత్తు ఒక్కసారిగా తగ్గిపోవడంతో నా తల పైభాగంలో (రూఫ్) గట్టిగా తగిలి కింద పడిపోయాను' అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హఠాత్ పరిణామంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.ఈ ఘటనపై ఎయిర్ ఇండియా యాజమాన్యం అధికారికంగా



స్పందించింది. విమానం ప్రయాణికులందరితో సురక్షితంగా ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండ్ అయిందని, అందరూ క్షేమంగా బయటకు వచ్చారని తెలిపింది. గాయపడిన 12 మందిలో ఇద్దరు క్యాబిన్ సిబ్బంది కూడా ఉన్నారు. ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదని, కేవలం స్వల్ప గాయాలే అయ్యాయని సంస్థ పేర్కొంది. ముందు జాగ్రత్త చర్యగా బాధితులను ఎయిర్‌పోర్టులోని వైద్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే తమ మొదటి ప్రాధాన్యమని, బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామని విమాన సంస్థ తెలిపింది. ఈ ఘటనపై సంబంధిత అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు వెల్లడించింది.

## కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు హర్యానాకు ఛాన్స్ ఇవ్వాలి: కాంగ్రెస్ ఎంపీ

కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని హర్యానాకు ఇవ్వాలని రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు కాంప్లెక్స్ ముందు నిరసనకు దిగారు. ఇతర రాష్ట్రాలతో కలిసి సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని అయినా ఇవ్వాలని కోరారు. భారత క్రీడావిజయాల్లో హర్యానా పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. కాబట్టి, 2030లో జరగనున్న




కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశం తమకు దక్కాలని చెప్పారు.ఈ నిరసనల్లో కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడాతో పాటు ఎంపీలు జైప్రకాశ్, వరుణ్ ముల్లానా, సత్‌పాల్ బ్రహ్మచారి, కర్మవీర్ బౌద్ధ కూడా పాల్గొన్నారు. హర్యానా మెడల్స్ తెస్తుంటే గుజరాత్‌లో క్రీడలు నిర్వహించడమేమిటని వారు ప్రశ్నించారు. క్రీడల వేదికపై కేంద్రం మరోసారి పునరాలోచించాలని కోరారు. హర్యానా హక్కులు సాధించుకునేందుకు తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. హర్యానా జనాభా తక్కువైనప్పటికీ అంతర్జాతీయ క్రీడా ఈవెంట్స్‌లో అత్యధిక మెడల్స్ సాధిస్తున్న రాష్ట్రంగా నిలుస్తోందని అన్నారు. క్రీడారంగంలో యావత్ దేశంలో హర్యానా ముందుందని గుర్తు చేశారు.

## ఈ20 పెట్రోల్ అమ్మకండి.. పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం



చండీఘడ్: దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్‌అమ్మకాలపై ఆందోళన వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహనాలు దెబ్బతింటున్నట్లు కొన్ని చోట్ల ఫిర్యాదులు అందాయి. అయితే దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ ఇవాళ పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం పాస్ చేశారు. 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాన్ని పంజాబ్ అసెంబ్లీ వ్యతిరేకించింది. ఇథనాల్ ఫ్రీ పెట్రోల్‌తో పాటు ఈ20 పెట్రోల్ ఎంపిక చేసుకునే అవకాశం వినియోగదారుడికి ఇవ్వాలని సభలో డిమాండ్ చేశారు. ఈ20 పెట్రోల్‌కు తగినట్లు డిజైన్ లేని వాహనాల్లో దాన్ని వాడడం వల్ల సమస్యలు వస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.ఈ20 వాడకం వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గుతుంది కాబట్టి, ఆ సామర్థ్యానికి తగినట్లు ఈ20 పెట్రోల్ రిటేల్ ధరను తగ్గించాలని తీర్మానంలో కోరారు. ఆటోమొబైల్ ఇంజినీర్లు, పెట్రోలియం నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, వినియోగదారుల సంఘాలు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో ఓ వ్యక్తిగత కమిటీని ఏర్పాటు చేసి ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై సమగ్రమైన స్టడీ చేయాలని తీర్మానంలో కేంద్రాన్ని డిమాండ్ చేశారు.సీఎం భగవంత్‌మాన్ సింగ్ సభలో మాట్లాడుతూ సుమారు 45వేల వాహనాలపై ఈ20 ప్రభావం గురించి స్టడీ చేశారని, ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడడం వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గినట్లు గుర్తించారని, కొన్ని వాహనాలు పాడైనట్లు కూడా ఆయన చెప్పారు. అసలు ఈ20 విషయంలో ప్రధాని మోదీ ఎందుకు పట్టుపట్టారని, ఇదేమీ నితిన్ గడ్కరీ కుమారుడికి లాభం తెచ్చిపెట్టదని, ఎందుకంటే మోదీకి, ఆయనకు మంచి సంబంధాలు లేవని, కేవలం అమెరికా ప్రభుత్వ వత్తిడి వల్లే ఈ20 పెట్రోల్ అమ్మకాలపై కేంద్రం వత్తిడి తెస్తున్నట్లు భగవంత్ మాన్ ఆరోపించారు.ఇటీవల అమెరికాతో వంద బిలియన్ల డాలర్ల వాణిజ్య ఒప్పందం కుదిరిందని, దానిలో భాగంగా 5 బిలియన్ల లీటర్ల ఇథనాల్ భారత్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని భగవంత్‌మాన్ ఆరోపించారు


## అస్సాం సీఆర్‌పీఎఫ్ క్యాంపులో విషాదం.. సహచరులపై కాల్పులకు దిగిన జవాన్



అస్సాం నగావ్ జిల్లాలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ క్యాంపులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. డ్యూటీలో ఉన్న ఓ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇద్దరు సహచర జవాన్లపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ కాల్పుల ఘటనలో మరో జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి.మంగళవారం ఉదయం సుమారు 7:00 గంటల సమయంలో బల్లాని ప్రేమబరం అనే ఏఎస్ఐ 34వ బెటాలియన్ క్యాంప్ ఆఫీస్ మెయిన్ గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఇంతలో గార్డు రూమ్‌లోని ఇన్‌సాస్ రైఫిల్ తీసుకుని వెనుక వైపు వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న విష్ణు ప్రసాద్ బఘేల్‌పై కాల్పులకు దిగడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. ఆ వెంటనే డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం అక్కడికి వెళ్లిన రామ్‌నవల్ సింగ్ యాదవ్‌పైనా కాల్పులు జరపడంతో.. ఆయన కూడా స్పాట్ డెడ్ అయ్యారు. ఆ తర్వాత మనే గోవింద్ శ్రీపుల్ అనే జవాన్‌నూ కాల్చారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఈ కాల్పుల అనంతరం శిబిరంలోని బ్యారక్‌లోకి వెళ్లిన ప్రేమబరం.. అదే తుపాకీతో తానూ కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు అధికారులు తెలిపారు. గాయపడిన జవాన్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్టు వెల్లడించారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న సీనియర్ సీఆర్పీఎఫ్, పోలీస్ అధికారులు.. వెంటనే శిబిరానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాల్పులకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన వెనుక వ్యక్తిగత లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ సాగిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## ఉదయనిధి స్టాలిన్‌కు ఊరట.. విచారణ అనంతరం విడుదల చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం..

నటి త్రిషకు సంబంధించిన వివాదాస్పద వ్యాఖ్యల కేసులో డీఎంకే నేత, తమిళనాడు అసెంబ్లీ ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ పూర్తయిన వెంటనే ఆయనను విడుదల చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వరకు బలవంతపు చర్యలు తీసుకోవద్దని కూడా స్పష్టం చేసిందికావేరి జలాల అంశంపై జరిగిన ఆందోళన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు నటి త్రిషను ఉద్దేశించినవిగా విమర్శలు రావడంతో వివాదం చెలరేగింది. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి చెన్నైలోని నివాసం నుంచి ఆయనను అదుపులోకి తీసుకున్నారుఈ



చర్యను సవాల్ చేస్తూ డీఎంకే తరపున మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టిన న్యాయస్థానం, విచారణ కోసం అవసరమైతే ప్రశ్నించవచ్చని, ఆ తర్వాత ఉదయనిధిని విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అలాగే తదుపరి విచారణ వరకు ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని సూచించింది.

# టైర్ 1 సిటీగా మారుతున్న విశాఖ




విశాఖపట్టణం, ఆగస్టు 4, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణం ఇప్పుడు కేవలం మాటలకే పరిమితం కాకుండా, కళ్లముందే నిజమై కనిపిస్తోంది. ఒకప్పుడు సాధారణంగా ఉన్న రహదారులు నేడు విశాలమైన నేషనల్ హైవేలుగా మారుతుంటే, ఏళ్ల తరబడి ఖాళీగా పడి ఉన్న భూములు ఇప్పుడు పరిశ్రమలతో కళకళలాడుతున్నాయి. సాంప్రదాయ పద్ధతుల్లో సాగిన పాఠశాలలు డిజిటల్ తరగతులుగా రూపాంతరం చెందుతున్నాయి. అలాగే సముద్ర తీర ప్రాంతాల్లో ఆధునిక వసతులతో ఫిషింగ్ హార్బర్లు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రతి రంగంలోనూ వస్తున్న ఈ మార్పులు రాష్ట్ర భవిష్యత్తుపై ప్రజలకు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి. ఈ ప్రగతికి సాగరతీర నగరం విశాఖపట్నం నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో ఎన్నో ఆకర్షణీయమైన ప్రకటనలు వచ్చినప్పటికీ, ఆచరణలో అనుకున్నంత పురోగతి కనిపించలేదు. కానీ ఇప్పుడు విశాఖ నగరం కొత్త రూపు దిద్దుకుంటోంది. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్ మిట్టల్ ప్రాజెక్టులతో పాటు భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో వైజాగ్ ప్రాంతం పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. ప్రకటనల స్థానంలో క్షేత్రస్థాయి ఫలితాలు కనిపిస్తుండటంతో నగర రూపురేఖలు వేగంగా మారుతున్నాయి. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు వేగంగా లభిస్తుండటంతో పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు మొగ్గు చూపుతున్నారు. భూముల కేటాయింపు నుంచి పనుల ప్రారంభం వరకు ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. దీనివల్ల నిన్నటివరకు నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలు కార్పొరేట్ ఆఫీసులు, పరిశ్రమలతో నిండిపోతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన యువత.. మళ్లీ సొంత రాష్ట్రానికే తిరిగి వచ్చి ఉద్యోగాలు సాధించే వాతావరణం నెలకొంటోంది. కేవలం పెద్ద ప్రాజెక్టులే కాకుండా విద్య, నైపుణ్య శిక్షణ, తీర ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారు. ఐటీఐల ఆధునీకరణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సముద్ర తీరాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ మత్స్యకారుల సంక్షేమం నుంచి విదేశీ ఎగుమతుల వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ఈ పురోగతి కేవలం ఒక నినాదం కాదు.. అది నిర్మిస్తున్న రహదారులు, తీర్చిదిద్దుతున్న తరగతి గదులు, యువతకు లభిస్తున్న ఉద్యోగాల రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రణాళికాబద్ధమైన ఆలోచనలు, వేగవంతమైన పనులతో రాష్ట్రం వికాస బాటలో వేగంగా అడుగులు వేస్తోంది.

# తెలప్రోలు వద్ద ఘోర ప్రమాదం

**డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టిన ప్రైవేటు బస్సు**

**25 మంది ప్రయాణికులకు గాయాలు - ఏడుగురి పరిస్థితి విషమం**

**చెన్నై నుంచి వైజాగ్ వెళ్తుండగా అర్ధరాత్రి దాటాక ప్రమాదంక్షతగాత్రులు పిన్నమనేని ఆస్పత్రికి తరలింపు**

ఉంగుటూరు, ఆగస్టు 4 ,ఉంగుటూరు మండలం తేలప్రోలు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చెన్నై నుంచి వైజాగ్‌కు 25 మంది ప్రయాణికులతో వెళ్తున్న 'బి.ఎల్.ఎమ్' (ఃఒఓ) ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. అనంతరం రహదారిపైనే పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది గాయపడగా, వారిలో ఏడుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా అరుపులు, కేకలతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సు మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్లే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిందని ఘటనా స్థలంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే ఉంగుటూరు పోలీసులు, 108 అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను బస్సు అద్దాలు పగలగొట్టి వెలుపలికి తీశారు. గాయపడిన 18 మంది స్వల్ప గాయాలతో బయటపడగా, తీవ్రంగా గాయపడిన ఏడుగురిని తక్షణ చికిత్స నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వెంటనే స్పందించి క్రేన్ సహాయంతో బోల్తా పడిన బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమా లేక బస్సులో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు

# కడప విమానశ్రయం మాజీ అధికారికి 3 ఏళ్ల జైలు శిక్ష

కర్నూలు,లంచం తీసుకుంటూ పట్టుబడిన మాజీ ఇంచార్జ్ డైరెక్టర్ ఒఊఓ ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్ కు 3ఏళ్ల జైలు శిక్ష, 50 వేలు జరిమానా కర్నూలు సిబిఐ ప్రత్యేక కోర్టు విధించింది. పెండింగ్ బిల్లులను త్వరగా

మంజూరుతో పాటు సంస్థను బ్లాక్ లిస్ట్ లో పెట్టకుండా ఉ ండేందుకు ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్ లంచం డిమాండ్ చేసాడు. 2005 జులై 24 వ తేదీ 25 వేలు లంచం తీసుకుంటూ ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్ సిబిఐకి దొరికిపోయాడు. అతనిపై 2016 ఫిబ్రవరి 29న చార్జ్‌షిట్ దాఖలు అయింది.

# నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు


విజయవాడ, ఆగస్టు 4,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లోకేష్ క్రియాశీలక పాత్ర పోషిస్తుండటం అందరికి తెలిసిందే. అధికార పక్షంలో ఆయనే కీలకమయ్యారు. ప్రతిపక్షం కూడా ఆయన పైనే గురి పెట్టింది. దాంతో లోకేష్ గ్రాఫ్ పెరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు వయసు 75 సంవత్సరాలు దాటాయి. ఇప్పటికే అయన నాలుగు సార్లు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేశారు. 16 ఏళ్ళ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఏకైక ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. అయితే రాబోయే కాలంలో తన కుమారుడు లోకేష్ ను ముఖ్యమంత్రిని చేయాలని భావిస్తున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే టీడీపీ వర్కింగ్ ప్రసిడెంట్ పదవి అప్పజెప్పారు. పార్టీ కీలక అంశాలని కుమారుడికి అప్పగించేశారు. ఇక మిగిలింది పట్టాభిషేకం. పరిపాలనా అనుభవం కోసం విదేశాలు తిప్పుతున్నారు. తరచుగా ఢిల్లీకి పంపిస్తున్నారు. కేంద్రంలోని మంత్రులతో మాట్లాడిస్తున్నారు. ప్రభుత్వంలో తీసుకునే



కీలక నిర్ణయాలలో లోకేష్ ను ఇన్వాల్వ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. రాబోయే కాలంలో లోకేష్ ముఖ్యమంత్రి కావడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రతిపక్ష వైసీపీ లోకేష్ ను టార్గెట్ చేసుకొని రాజకీయాలు చేస్తుండడం గమనించవచ్చు. నిన్నా మొన్నటి వరకు లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించిన వైసీపీ ఇప్పుడు డీఎస్సి అక్రమాల గురించి పోరాటం స్టార్ట్ చేసింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తరహాలోనే లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేసింది. అంటే భవిష్యత్తులో తాము లోకేష్ తోనే పోరాడాల్సి వస్తుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థిర నిర్ణయానికి వచ్చారని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను సైతం పక్కన పెట్టి లోకేష్ పై బాణం ఎక్కు పెట్టడం దీనికి నిదర్శనమని పేర్కొంటున్నారు . మొత్తం మీద అటు అధికార పార్టీ లోకేష్ చుట్టూ తిరుగుతుంటే ఇటు ప్రతిపక్షం కూడా లోకేష్ కేంద్రంగానే విమర్శలు గుప్పిస్తుండడం విశేషం.

# ఆశావహులు.. అదుపు తప్పుతున్నారా

కాకినాడ, ఆగస్టు 4, టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ధిక్కార స్వరం వినిపిస్తున్నారా? స్థానికంగా తన హవాను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారా? అంటే.. అవుననే సమాధానమే టీడీపీ వర్గాల్లో వినిపిస్తోంది. కాకినాడ పోర్టును విస్తరించే పనులకు ఆయన సుముఖంగానే ఉన్నా.. పార్టీ పరంగా ఆయన వ్యవహరించడం లేదనే టాక్ వినిపిస్తోంది. కాకినాడ పోర్టకు కోన పోర్టుగా పేరు పెట్టాలన్నది యనమల డిమాండ్. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న పైగా ఎవరికీ లేని ఈ డిమాండ్ విషయంలో యనమల స్థానికతను పురిగొల్పుతున్నారు. పోర్టుకు అవసరమైన భూములు ఇస్తోంది కోనసీమ ప్రాంత రైతులని, కాబట్టి.. పోర్టుకు కోన



పేరు పెట్టాలన్నది యనమల సూచన. ఇదే ఇప్పుడు డిమాండ్‌గా మారుతోంది. ఈ నెల 20లోగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని కోన పోర్టుగా పేరు నిర్ధారించాలని.. లేకపోతే, ప్రజల ఆకాంక్షల మేరకు తాను కూడా వ్యవహరిస్తానని చెప్పు కొచ్చారు. ఈ వ్యవహారంపై ఆయన ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. తాజాగా స్థానికులతో భేటీ కావడం మరింత ఆసక్తిగా మారింది. కోన సీమ రైతుల నుంచి భూములు తీసుకుంటున్నారని, అలాంటప్పుడు కాకినాడ పోర్టు అని పేరు ఎందుకని ఆయన చెబుతున్నారు. అయితే.. వాస్తవానికి.. భూములు తీసుకున్నంత మాత్రాన అదే పేరును ఉంచాలని ఏమీ లేదు. ఈ విషయం తెలిసినప్పటికీ.. యనమల మాత్రం తన దారి తనదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా ఇది పెద్ద ఉద్యమంగా మారాలని ఆయన ఆకాంక్షిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రాధాన్యం కొరవడడంతోనే.. ఇటు పార్టీలోను, అటు ప్రభుత్వంలోనూ యనమల ప్రాధాన్యం ఒకప్పుడు ఉన్నట్టుగా ఇప్పుడు లేదు. గతంలో తిప్పిన చక్రం.. ఇప్పుడు మూలబడినట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. ఎమ్మెల్సీగా రిటైరైన తర్వాత.. రాజ్యసభ ఆశించారు. లేదా గవర్నర్ గిరీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ రెండు చేజారుతున్నా యి. పైగా తన ముందు రాజకీయాల్లోకి వచ్చిన వారికి పదవులు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ తనను పూర్తిగా పక్కన పెడుతోందని గ్రహిస్తున్న ఆయన.. ఇలా.. కీలక విషయాలపై ఫోకస్ చేశారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మాట.

# వేమండలో '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం'

**పాల్గొన్న విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**

**రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే**

**ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన యార్లగడ్డ**

**వేమండలో ఇప్పటివరకు రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని వెల్లడి**

**కలవపాముల రహదారి అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధిస్తామని హామీ**

**గత ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే యార్లగడ్డ విమర్శ**

గన్నవరం,ఉంగుటూరు మండలం వేమండ గ్రామంలో సోమవారం నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం ? అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అంతకుముందు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గన్నవరం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో రహదారులు దయనీయ స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. గత ఐదేళ్లలో గుడివాడ – కలవపాముల, తరిగొప్పల – మానికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న రహదారులలో సుమారు 80 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వేమండ గ్రామంలో ఇప్పటికే ఆరు సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ మరమ్మతులు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు, హెడ్ పంప్ ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్ పథకం కింద రూ.37 లక్షల వ్యయంతో 250 విద్యుత్ స్తంభాల మార్పిడ గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.1.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. కలవపాముల రహదారి అభివృద్ధికి సుమారు రూ.1.70 కోట్లుఅవసరమవుతున్నాయని, ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో మిగిలిన సిమెంట్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులకు కూడా ప్రాధాన్యమిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజలు కోరిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు మండల తహసీల్దార్ జలాది విమల కుమారి, ఎంపీడీవో ఈ సత్య కుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, తోట నాగభూషణం, కాపుదాసి సునీల్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, తేలప్రోలు పిఎసిఎస్ చైర్ పర్సన్ ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, ఉయ్యూరు మురళి, బెజవాడ నాగేశ్వరరావు, రాజబోయిన శివాజీ, తుమ్మల జగదీష్, యర్రగుంట్ల వినోద్, చల్లగుల్ల సందీప్, కొసరాజు సాయిరాం, పసుపులేటి సుబ్బారావు, కానూర్ల శ్రీను, పకీరు, పొన్నగంటి బాలకృష్ణ, వెనిగళ్ళ రాము, గంప భీమయ్య, యలమంచిలి దినేష్, మరీదు శ్రీను, శివరాం, తుమ్మల లత, పొట్లూరి భువనేశ్వరి జనసేన నాయకులు చిమట రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో కీలక ముందడుగు



విజయవాడ, ఆగస్టు 4, అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సర్వేను అధికారికంగా ప్రారంభించారు. భూసేకరణ వల్ల స్థానిక ప్రజలు, వ్యాపార సంస్థలపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, వారికి తగిన పరిహారం , పునరావాసం కల్పించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రభావిత ప్రాంతాల ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారు. విజయవాడ మెట్రో మొదటి విడత నిర్మాణంలో భాగంగా రెండు ప్రధాన కారిడార్లను ప్రతిపాదించారు. మొదటి కారిడార్ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుండి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు విస్తరించి ఉండగా.. రెండో కారిడార్ ఖఔఒ నుండి పెనమలూరు వరకు సాగనుంది. ఈ రెండింటికీ ప్రధాన రవాణా కేంద్రమైన పండిట్ నెహ్రూ బస్ స్టషన్ వద్దే రెండు ప్రత్యేక మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లతో పాటు గన్నవరం ఎయిర్‌పోర్టును మెట్రో ద్వారా అనుసంధానించడం వల్ల ప్రయాణికులకు సత్వర , సునాయాస రవాణా వసతి లభించనుంది. గతంలో నిలిచిపోయిన ఈ మెట్రో ప్రాజెక్టను మళ్లీ పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండటంతో విజయవాడ , అమరావతి పరిసర ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్‌కు అవసరమైన అనుమతులు, డిజైన్లు , భూసేకరణకు సంబంధించిన పనులు సమాంతరంగా జరుగుతుండటం ప్రాజెక్ట్ అమలుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోంది. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ , ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన వెంటనే భూసేకరణ తుది ప్రక్రియ ప్రారంభమై, విజయవాడ మెట్రో నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి.

# కిడ్నాప్ కేసులో వైసీపీ నేత అరెస్ట్..

**గుజరాత్‌లో పట్టుబడ్డ మాజీ ఎమ్మెల్యే ముస్తఫా**

**కొద్ది రోజులుగా తప్పించుకు తిరుగుతున్న ముస్తఫా**

**టెక్నికల్ నిఘా సాయంతో నిందితుడి ఆచూకీ గుర్తింపు**

వైసీపీ నేత, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాను పోలీసులు అరెస్ట్ చేశారు. కిడ్నాప్ కేసుకు సంబంధించి గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న ఆయన్ను నూజివీడు పోలీసులు గుజరాత్‌లో అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక నిఘా సాయంతో ముస్తఫా ఆచూకీని గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నేపథ్యం: ఇటీవల పొగాకు లోడ్‌తో వెళ్తున్న ఒక వాహనాన్ని ముస్తఫా కుమారుడు, అతని అనుచరులు అడ్డగించారు. ఆ వాహనంలో ఉన్న పొగాకు వ్యాపారితో పాటు మరో వ్యక్తిని కిడ్నాప్ చేసి బంధించారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు రంగంలోకి దిగి కిడ్నాప్‌కు గురైన ఇద్దరినీ సురక్షితంగా విడిపించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా తొలుత ముస్తఫా కుమారుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అయితే, విచారణలో ఈ కిడ్నాప్‌తో మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు కూడా సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో ఆయనపై కిడ్నాప్, బెదిరింపుల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా అజ్ఞాతంలోకి వెళ్లగా, చివరకు సాంకేతిక ఆధారాలతో ఆయన గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. ముస్తఫా అరెస్ట్‌ను పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు.

# ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధికి చర్యలు

**ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ**

నరసరావుపేట,పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. ప్రస్తుతం దాదాపు 200 పడకలతో అన్ని విభాగాల్లో సర్జరీలు, ఓపీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ నెలలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించి మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకే హెచ్ డి ఎస్ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాత ఏరియా ఆసుపత్రి భవనాలను తొలగించి అక్కడ తల్లీబిడ్డల ఆరోగ్య సముదాయం నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు ఇప్పటికే నాబార్డు ద్వారా రూ.55 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మంత్రి పర్యటన తర్వాత నిర్మాణ ప్రణాళికలను ఖరారు చేస్తామన్నారు. అలాగే రోగులకు తాగునీటి సరఫరా, రెస్ట్ రూమ్స్ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు డాక్టర్ భారతీ దేవి, మిరియాల వెంకట సుబ్బమ్మ, తవ్వా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# సీడీపీఓ మద్దెమ్మ పై ఆరోపణలు పూర్తిగా అవాస్తవం



విభారే న్యూస్ కర్నూల్ ప్రతినిధి ఆగస్టు 5 కర్నులు జిల్లా ఆస్పరి ప్రాజెక్ట్ఐసిడిఎస్ సిడిపిఓ మద్దమ్మ పై కొందరు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని పూర్తి అవాస్తవమని దేవనకొండ తెర్నేకల్, అస్పరి, బిల్లేకల్ నాలుగు సెక్టార్ల పరిధిలోని అంగన్వాడి టీచర్లు హెల్పర్లు పేర్కొన్నారు. మంగళవారం అంగన్వాడి టీచర్లు జ్యోతి, సుజాత, నాగమణి ప్రమీల, చిట్టెమ్మ, మెహరీన్ భీ ల ఆధ్వర్యంలో వారు మీడియాతో మాట్లాడుతు గత నెల 21వ తేదీన ప్రాజెక్టు మీటింగ్లో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ కు కోటకొండ సెక్టార్ కు చెందిన కొందరూ సిడిపిఓ మద్దమ్మ పై ఆరోపణలు చేయడం జరిగిందని అవి పూర్తిగా అవాస్తమన్నారు. సీడీపీఓ వలన 131 సెంటర్లలో 110 అంగన్ వాడి సెంటర్ల టీచర్లకి, ఆయాలకు ఎటువంటి సమస్యలు లేవని పేర్కొన్నారు. తమను సీడీపీఓ మేడం మానసిక వేధింపులకు పాల్పడు తుందంటూ చేసిన ఫిర్యాదు పూర్తి అవాస్తమన్నారు. అధికార దుర్వినియోగం దుర్భాషలాడడం ఉద్యోగం నుండి తొలగిస్తామని ఎలాంటి బెదిరింపులకు పాల్పడ లేదని పేర్కొన్నారు. సీడీపీఓ ఎటువంటి వేధింపులకు గాని పాల్పడలేదని స్పష్టం చేశారు. తాము ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయాలని వెళ్ళాలి అకున్నపుడల్లా తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇందులో బీజేపీ పార్టీ కి చెందిన కొందరు నాయకులు కోటకొండ సెక్టార్ కు చెందిన కొందరు టీచర్లు గొడవలు జరుగుతాయంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఎ.ఉ. భవాని అనే అంగన్వాడీ టీచర్ మాట్లాడుతూ తాను కప్పట్రాళ అంగన్ వాడి సెంటర్ 2 లో విధులు నిర్వహిస్తున్నానని నేను 3 లక్షల రుపాయలు సీడీపీఓ మద్దమ్మ కు ఇచ్చానని అరోపణలు చేస్తున్నారని ఇది పూర్తి అవాస్తవమన్నారు. ఇలాంటి అరోపణలు చేయడం సరికాదన్నారు

# పంటల బీమాపై రైతులకు అవగాహన---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు ఆగస్టు 4: నంద్యాల మండలంలోని చాపిరేవుల, పాండురంగాపురం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ నెల 15వ తేదీలోగా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. వరి, మొక్కజొన్న, కంది, మినుము, మిరప తదితర పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్నకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే మినుము, కంది, పెసర వంటి పంటలను సాగు చేయాలని, భూమి సారాన్ని పెంచేందుకు పీఎండీఎస్ విత్తనాలను వెదజల్లాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది సాలమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారి బాలలింగమయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# లేఅవుట్లలో ఆక్రమణల తొలగింపు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 4:నంద్యాల పట్టణంలోని లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు మంగళవారం ఉక్కుపాదం మోపారు. కమిషనర్ బి. శేషన్న ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగించారు. పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 348/52లో 6.27 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన అధికారులు, జేసీబీల సహాయంతో వాటిని తొలగించారు.



ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని, ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిరక్షిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బి. శేషన్న మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలపై ఎలాంటి ఆక్రమణలనూ ఉపేక్షించబోమన్నారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలతో పాటు, అక్రమ నిర్మాణాల తొలగింపు ఖర్చును కూడా సంబంధిత వారినుంచే వసూలు చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని, పట్టణంలోని అన్ని లేఅవుట్లలో ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

# మండలి వెంకట కృష్ణారావుకు నివాళి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 4: ప్రముఖ విద్యావేత్త, మాజీ మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు జయంతిని నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా భావించి జీవితాంతం ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడు మండలి వెంకట కృష్ణారావు అని కొనియాడారు. రాజకీయాల్లో నిజాయితీ, నిబద్ధత, విలువలకు కట్టుబడి ప్రజలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ బాష మాట్లాడుతూ దివిసీమ ఉప్పెన సమయంలో బాధితులకు అండగా నిలిచి విశేష సేవలు అందించినందుకు ఆయనకు ''దివిసీమ గాంధీ''గా గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ చిన్ని కృష్ణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీపీఓ అధికారులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హాలహర్వి మండల ఆర్యవైశ్య సంఘ ప్రమాణ స్వీకారోత్సవం..



విభారే న్యూస్ ఆగస్టు 04 ఎమ్మిగనూరు..ఆలూరు తాలూకా హాలహర్వీ మండల ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కన్నుల పండుగగా జరిగినది. కర్నూలు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిలేహాలు భాస్కర్ శెట్టి ప్రధాన కార్యదర్శి గ్రంథే వెంకటగిరి కోశాధికారి ప్రతాప్ రంగయ్య శెట్టి వారిచే హాలహర్వి మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగినది. ఇల్లూరు శ్రీధర్ శెట్టి హాలహరి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నెల్లూరు శ్రీధర్శెట్టి హాలహర్వి మండల ఆర్యవైశ్య అధ్యక్షులుగాను మిగతా సభ్యులందరి చే జిల్లా అధ్యక్షులు బిలేహాలు భాస్కర్ శెట్టి ప్రమాణ స్వీకారం చేయించారు. హాలహర్వి మండల మహిళ సంఘ సభ్యులతో కూడా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమం కు బిలేహాలు వీరేష్ ఉపాధ్యక్షులు బిలేహాలు భరత్ కుమార్ గొంది సుధాకర్ గుండా సుబ్రహ్మణ్యం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఆలూరు మండలం ఆలూరు మండల ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారనీ జిల్లా ప్రధాన కార్యదర్శి గ్రంథే వెంకటగిరి వారిచే ప్రమాణస్వీకారం చేయించారు.

# ఆక్రమణలపై కఠిన చర్యలు--

## ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు: కమిషనర్ బి. శేషన్న---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఆగస్టు 4: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల పురపాలక సంఘం కమిషనర్ బి. శేషన్న హెచ్చరించారు.



ప్రభుత్వ భూములను కాపాడడం మున్సిపాలిటీ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములకు సంబంధించిన పలు సర్వే నంబర్లలో అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తున్నట్లు పురపాలక సంఘం దృష్టికి వచ్చినట్లు తెలిపారు. సంబంధిత భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నవేనని, వాటిపై ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేయడం, విక్రయించడం పూర్తిగా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఈ అక్రమ లేఅవుట్లపై ఇప్పటికే పట్టణ ప్రణాళిక విభాగానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సంబంధిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లను పూర్తిగా తొలగించి (డెమాలిష్) చేయనున్నట్లు వెల్లడించారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ అనుమతి లేని లేఅవుట్లలో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. ప్లాటు కొనుగోలు చేసే ముందు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తి వివరాలు తెలుసుకుని, చట్టబద్ధ అనుమతులు ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని కోరారు. అనుమతులు లేని లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టినా, ప్రభుత్వ భూములను ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని కమిషనర్ బి. శేషన్న హెచ్చరించారు. ప్రజలు చట్టబద్ధమైన లేఅవుట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేసి మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా ఘన నివాళి

## తెలుగు భాష, సంస్కృతి, ప్రజా సంక్షేమానికి ఆయన సేవలు చిరస్మరణీయం

## జిల్లా పర్యాటక శాఖ అధికారి తిరుమల నాయుడు

కర్నూలు, ఆగస్టు 4:–స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, మాజీ మంత్రి, తెలుగు భాషా?సాంస్కృతిక వికాసానికి విశిష్ట సేవలందించిన దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా ఆయన సేవలను ఘనంగా స్మరించుకున్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పర్యాటక శాఖ మరియు సెట్కూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి తిరుమల నాయుడు, సెట్కూరు సీఈవో వేణుగోపాల్ మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమాజంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి తిరుమల నాయుడు మాట్లాడుతూ...మండలి వెంకట కృష్ణారావు 1926 ఆగస్టు 4న కృష్ణా జిల్లా కైకలూరు మండలం పల్లెవాడ గ్రామంలో జన్మించారు. విద్యార్థి దశలోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. అనంతరం ప్రజాసేవలోకి అడుగుపెట్టి 1972లో అవనిగడ్డ శాసనసభ నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దివిసీమ ప్రాంత ప్రజల అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేసి "దివిసీమ గాంధీ"గా ప్రజల అభిమానాన్ని పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ కోట్టే చెన్నయ్య మాట్లాడుతూ...ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మండలి వెంకట కృష్ణారావు 1955లో బంజరు భూముల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి సుమారు 15 వేల ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీ చేశారు. గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయాయి.

# తల్లిపాల వారోత్సవాలు నిర్వహణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఆగస్టు 4: నంద్యాల లయన్స్ క్లబ్, ఐఎంఏ మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని తల్లీ–బిడ్డల విభాగంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మజ, చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జి. రవికృష్ణ, డాక్టర్ నెరవాటి అరుణకుమారి, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ సుధావాణి, డాక్టర్ వసుధ తదితర వైద్యులు తల్లిపాల వల్ల తల్లి, శిశువుకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. నెరవాటి ఆసుపత్రి సౌజన్యంతో 200 మంది గర్భిణీలు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు జ్ఞాపికలతో సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సందీప్, కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

# సాయిబాబా నగర్‌లో భవనాలపై ప్రత్యేక తనిఖీలు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 4:నంద్యాల పట్టణంలోని 25వ వార్డు సాయిబాబా నగర్‌లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న ఆధ్వర్యంలో ప్రత్యేక భవన తనిఖీలు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారులు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొని ప్రాంతంలోని వివిధ నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, ఆమోదిత ప్రణాళికల ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అనే అంశాలను అధికారులు పరిశీలించారు. నిర్మాణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే మున్సిపల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కమిషనర్ బి. శేషన్న తెలిపారు. ప్రజలు భవన నిర్మాణాలు ప్రారంభించే ముందు మున్సిపాలిటీ నుంచి అవసరమైన అనుమతులు పొందాలని, ఆమోదిత ప్రణాళిక మేరకే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టడం ద్వారా పట్టణం క్రమబద్ధమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# నిసార్ కుటుంబాన్ని పరామర్శించిన ఎస్‌డీపీఐ---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 04–నంద్యాల ఆటోనగర్ స్థలాల వ్యవహారంలో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో మృతిచెందిన వెల్డర్ నిసార్ కుటుంబాన్ని ఎస్‌డీపీఐ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిసార్ కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, భార్యతో పాటు ముగ్గురు సంవత్సరాల చిన్నారి, 20 రోజుల పసికందు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే నిసార్ మరణానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీపీఐ జిల్లా నాయకులు ఎజాస్ హుస్సేన్, టి. కరీముల్లా, సుల్తాన్, లింకన్ రాజు, మాజీద్ ఖాన్, రిజ్వాన్, యున్యూస్, ఫయాజ్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు అర్బన్ అంగన్వాడి కేంద్రాల్లో తల్లుల సమావేశం.

. విభారే న్యూస్ ఆగస్టు 04 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు టౌన్ లో తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు ఒకటి నుంచి ఏడు వరకు అవగాహన కార్యక్రమాలు సందర్భంగా మంగళవారం రోజు అర్బన్ అంగన్వాడి సెంటర్లలో తల్లులందరిని సమావేశపరిచి ముర్రుపాల ప్రాముఖ్యత, తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి తల్లులందరికీ అవగాహన కల్పించడం జరిగింది బిడ్డకు తల్లి పాలు పట్టడం వల్ల బిడ్డకే కాకుండా తల్లికి కూడా లాభాలు ఉన్నాయి అవి ఏమనగా బిడ్డకు పాలు పట్టడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుంది, బిడ్డకు బిడ్డకు మధ్య దూరం ఉంటుంది అలాగే తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులందరితో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది ఈ సమావేశానికి సూపర్వైజర్లు నాగలక్ష్మి భాగ్యలక్ష్మి అంగన్వాడీ టీచర్లు నాగలక్ష్మి బసమ్మ కృష్ణవేణి నూర్జహాన్ పరిమళ వెంకటేశ్వరమ్మ శిరీష షమిన వరలక్ష్మి సురేఖ హాస్మత్ వరలక్ష్మి శారదా హేమలత, గర్భిణీలు బాలింతలు తల్లులు కిశోర బాలికలు అందరు కూడా హాజరు కావడం జరిగింది..

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190